# ★ ఉత్తరాల ఉదంతం ★

శ్రీ కన్నెకంటి ప్రభాకరశాస్త్రి

మదరాసు. తే. 6-2-56

ప్రియమైన శ్రీవారికి....

మీరాణి నమస్కరించి వ్రాయునది. మీరు పంపిన చీరె ఉత్తరం రెండూ చేరినవి. మీ ఉత్తరం చదువు తుంటే మిమ్ములను చూచినట్లే ఉంది. నాకు యింకా పనిచేసే సత్తువరాలేదు. పాప ఆరోగ్యంగా ఉన్నాడు. "అదుగో నాన్న" అంటే ఆత్రంగా చూస్తాడు. కనీసం నాలుగునెల లయినా ఉండాలంటుంది అమ్మ. మీరు హోటలు భోజ నంతో ఎంత బాధపడుతున్నారో అని బెంగగా ఉంది. అయినా ఏంచేస్తాం ఈ ఉత్తరం చూచిన వెంటనే ఒక సారి వచ్చి బాబును చూసి పోతారు కదూ—

ఇట్లు—మీ
చరణదాసి —రాణి

నెల్లూరు. 14-2-56

ప్రియమైన రాణికి-

నీ వుత్తరం అందినది. నీవు ఆరోగ్యంగా ఉన్నందుకు సంతోషం- మన పాపను చూడాలని ఎంతో ఉబలాటంగా ఉంది. నా ఆఫీసు పరిస్థితులు నీకు తెలుసు గదా! ఒక రోజుకాదు కదా ఒక క్షణికమైనా తీరికదొరకదు. కడుపు తీపికొద్దీ మీవాళ్ళు ఉండమంటారు. నీవు యిక్కడి పరిస్థి తులు గమనించవద్దూ! హోటలు భోజనం తిని సగ మయ్యాను. నీవు వెళ్ళి నెలయినా ముప్పయి సంవత్సరా యినట్లయింది. పదిరోజులలో రావలసింది. పాపకు నా ముద్దులు.

ఇట్లు—నీ
—మూర్తి

మదరాసు. 28-2-56

శ్రీవారికి-

రాణి హృదయ పూర్వక వందనములు....

అమ్మకు మీ ఉత్తరం చూపించాను. ఆమె ఏదిఏమైనా నన్ను ఆరునెలల దాకా పంపనంది. శని ఆది వారాలలో యిక్కడికే రమ్మని వ్రాయమని చెప్పింది. అక్కడైతే పాపకు నీటికి యిబ్బందని. ఆలోచిస్తే ఆమె చెప్పింది నిజమే ననిపిస్తుంది. మీరే రాగూడదూ? మిమ్ములను చూడాలని ఉంది. వస్తారు గదూ... ఇట్లు—మీ

దాసి —రాణి

నెల్లూరు. 3-3-56

రాణికి—

నీ ఉత్తరం అందినది. నా ఆరోగ్యం సరిగాలేదు.... ఆకలి తగ్గిపోయింది. యిల్లంతా అసహ్యంగా ఉంది. చివ రకు సరిగా స్నానంకూడా చేయలేక పోతున్నాను. నీవు త్వరగా రావలసింది. ప్రసవించికూడా నెలేఅయింది. కావా లంటే పనిమనిషిని పెట్టుకోవచ్చు. ఈ ఉత్తరం అంద గానే మంచిరోజు చూసుకొని మీ తమ్ముడిని వెంటబెట్టు కునిరావలసినది. బాబుకు ఆశీస్సులు. నీ—

....మూర్తి

మదరాసు. 18-3-56

ప్రియమైన శ్రీవారికి నమస్కారములు.

బాబు ప్రక్కలో నొర్లు తున్నాడు. చూస్తుంటే నా హృదయం ఆనందంతో నిండుతుంది. మీరు వెంటనే వచ్చి వెళ్ళవలసింది. మీ ఆరోగ్యం జాగ్రత్త. హోటలు లోనే వేడి నీళ్ళు ఏర్పాటు చేసికొండి. యిల్లుచిమ్మటానికి పక్క వెయ్యటానికి ఒక పిల్లవాణ్ణి పెట్టుకోండి. ఆడ వాళ్ళను మాత్రం పెట్టుకోకండేం! వస్తువులు ఒక్కటి కూడా దక్కవు. అబ్బాయికి పాలపీకలు పంపుతారుకదూ! మీ ఉత్తరం కొరకు నిరీక్షించే- మీ

రాణి

నెల్లూరు. 22-3-56

ప్రియమైన రాణికి—

నీవుచెప్పినట్లు పనిమనిషిని పెట్టుకొన్నాను. యిప్పుడు కొంచెం కష్టం తగ్గింది. అయినా నీవు వెంటనే బయలు దేరి రావలసింది. నీ-

మూర్తి-

మదరాసు. 27-3-56

శ్రీవారికి—

ఇక్కడ బాబూ నేను క్షేమం. మీ క్షేమములు తెలియ పర్చవలెను. మా అన్నయ్య మరదలు పెళ్ళి 9 తారీఖున జరుగుతుంది. మే మందరం వెళుతున్నాము. బీరువాలో మూడో అరలో క్రింమ్‌సన్ రంగు సిల్కు చీరె ఉంది. పంపండి. మీరుకూడా వస్తే బాగుంటుంది. నేను రాలే నందుకు క్షమిస్తారు గదూ.... మీ రాణి.

నెల్లూరు. 2-4-56

ప్రియమైనరాణికి....

నీవు కోరిన రంగు నాకుతెలియదు. మన ప్రక్కింట్లో చేరిన పంతులమ్మ నడిగి తెలిసి కొన్నాను. నీవు పెండ్లి ప్రయాణం జాగ్రత్తగా చేయవలసినది. నీవు ఎప్పుడు వచ్చేది తెలిపేది. నీ—
'మూర్తి.

మదరాసు. 3-4-56

ప్రియమైన శ్రీ వారికి.

మీ దాసి నమస్కారములు. మీరు జాగ్రత్తగా ఉండ వలసినది. తోడుగా ఎవరినైనా పడుకో బెట్టు కోండి. పంతులమ్మను ఇంటిలోనికి రానీయకండి. ఏవైనా ఎత్తుకు పోవచ్చు. తాళాలు బాగా వెయ్యండి. నే చెప్పిన వన్నీ గుర్తుంచు కుంటారు కదూ! మీ— దాసి
రాణి.

నెల్లూరు. 9-4-56

రాణికి—

నా ఆరోగ్యం బాగా ఉంది. నీ ఆరోగ్యం జాగ్రత్త. ఇక్కడ నీవు లేనిలోటు కనపడ కుండా పంతులమ్మ సాయంచేస్తుంది. మొన్ననాకు జ్వరం వస్తే మందు కూడా యిచ్చింది. మీ అమ్మా వాళ్ళయిష్ట ప్రకారమే ఉండి రావలసింది. నీ—మూర్తి.

మదరాసు. 11-4-56

ప్రియమైన శ్రీ వారి పాదసన్నిధికి.

మీ చరణ దాసి నమస్కరించి వ్రాయునది. నా మనస్సేమీ బాగాఉండటంలేదు. మిమ్ములను విడిచి ఉండలేక పోతున్నాను. వద్దామంటె మూఢ మొచ్చింది. 15 రోజుల వరకూ రావటానికి వీలులేదు. నా హృదయం ఎందుకో మిమ్ములను చూడాలని తహ తహలాడుతుంది. మీరు రమ్మంటే వచ్చేస్తాను. మీ లేఖకై నిరీక్షించే—

మీ చరణ దాసి-రాణి.

నెల్లూరు. 18-4-56

రాణికి—

మూఢంలో రావద్దు. యిప్పుడేంతొందరలేదు. మొన్న పంతులమ్మా నేనూ కలసి నీకు నచ్చేచీర తెచ్చాము. అంటే నీ రంగు చెపితే ఆమె సెలక్టు చేసింది. పంపుతున్నాను. అందినట్లు వ్రాయవలసింది.

నీ మూర్తి

మదరాసు. 20-4-56

ప్రియమైన శ్రీ వారి పాదసన్నిధికి-

రాణి వందనములు.

నేను 27 న బయలు దేరి వస్తున్నాను. రైలు దగ్గరకు రావలసింది. మీ రాణి

నెల్లూరు. 22-4-56.

రాణికి—

నేనూ కొందరూ, పంతులమ్మా కలసి 26 వతేదీన హంపీ పోతున్నాము. తిరిగిరాగానే ఉత్తరం వ్రాస్తాను. అంత వరకూ నీవు రావద్దు. చిరంజీవికి నా ముద్దులు.

నీ మూర్తి.

25 వ తేదీన తమ్ముణ్ణి వెంటబెట్టు కొని వచ్చిన రాణి 'ఏమండీ పంతులమ్మేది' అని అడిగింది, పంతులమ్మా? ఆమెనిన్ననే యిల్లు ఖాళీ చేసింది అన్నాడు మూర్తి తడుముకోకుండా నవ్వుతూ తనప్లాను పని చేసినందుకు.

---